

# వయసు పిలిచింది

బి. సంధ్య

"దౌర్భాగ్యపు వెధవా! నిన్ను కన్నందుకు నాకు సుఖము, శాంతి లేకుండ చేస్తున్నావు గదరా! మీ అమ్మ బతికుంటె నన్నిలా ఆడించేవాడివా? ఛీ, ఛీ, యీ యింట్లో నా మాటకి గడ్డిపోచంత విలువ కూడ లేకుండా పోయింది" అలుపు లేకుండ అష్టోత్తరం చదువుతున్నట్లు వస్తున్న నాన్నగారి కేకలకి, అప్పుడే యింట్లో కాలు పెట్టబోతున్న నేను యెత్తిన కాలుని అలాగే గాల్లోనే ఆపేసి ఆ కేకలు తనని వుద్దేశించి నవా, కావా, అని సినిమాలో రాజబాబులా ఒకసారి అన్ని ప్రక్కలా చూశాను. నా చుట్టు ప్రక్కల కనుచూపు మేరలో యెవరూ లేక పోవడంతో సదరు తిటన్నీ నన్నే అని నిర్ధారణకొచ్చి నెమ్మదిగా గాల్లోని కాలుని గడపమీద ఆనించి ఆలోచనలో పడ్డాను.

నాన్నగారు తనలా 'దౌర్భాగ్యుడా" అని తిట్టారంటే ఖచ్చితంగా యేదో మంచి బేరం తగిలిందన్నమాటే అని అనుకున్నాను. ఆ తండ్రి వ్యాపారంలో పశువునైనా ఏభైవేల పైచిలుకు ధర పలుకుతూ, నాలుగేళ్ళ నుండి ఒక గొప్ప పేరున్న బ్యాంక్‌లో ఆఫీసరుగా చేస్తున్న నేను — ఈ నాలుగేళ్ళ నుండి కనీసం పదిరోజులకోసారైనా ఆయన నన్నలా తిట్టడం, నేను దులుపుకుని వెళ్ళిపోవడం పరిపాటే గనుక వాతావరణం చల్లబడ్డాక రావచ్చనే వుద్దేశ్యంతో వెనుతిరిగాను.

కాని యింతలో "ఒరేయ్ రాంబాబు" అన్న పిలుపుకి మళ్ళీ బొంగరంలా యింటి వైపుకి తిరిగి "పెద్దన్నయ్యా, నువ్వెప్పుడొచ్చావ్" అని ఆశ్చర్యంగ అడిగేలోపున ప్రక్కగది గుమ్మం నుండి చిన్నన్నయ్య కూడ వచ్చేసరికి డబుల్ ఆశ్చర్యపోయి, ఆనందంతో అప్రయత్నంగ లోపలికి అడుగు వేశాను.

అమ్మ పోయిన తరువాత యింట్లో చాల ఒంటరిగ ఫీల్ అయ్యే నాకు, యెవరైనా యింటికొస్తే చాలు పెద్ద పండగలా వుంటుంది. కాని యిప్పుడు మాత్రం నా ఆనందం యెంతోసేపు నిలవలేదు.

"ఒరేయ్, యెందుకురా నాన్నగార్ని వయసులో అలా బాధ పెడతావ్? నీ పెళ్ళి కూడ అయిపోతే ఆయనకి బాధ్యతలేవీవుండవు కదా! పోనీ నీకు నచ్చిన అమ్మాయెవరైనా వుంటే చెప్పొచ్చు కదా! నువ్వు యేదీకాకుండ అనలిప్పుడప్పుడే పెళ్ళే చేసుకోనంటే యెలా" అంటూ గుక్క తిప్పుకున్నాడు పెద్దన్నయ్య.

"ఏరోయ్, యేమైనా లవ్ ఆఫెయిరా" అంటూ హాస్యమాడబోయాడు చిన్నన్నయ్య. ఇంతకాలం ఒక్కొక్కళ్ళే వచ్చి సతాయించే వారు. ఇప్పుడు అందరూ ఒక్కసారే యిలా వూహించని దాడి చేసేసరికి అందరూ వచ్చారన్న సంతోషం కూడ పోయి మాష్టారి ముందు పాఠం అప్పచెప్పని కుర్రాడిలా నిలబడి పోయాను.

"ఏరా, మినిష్టర్‌లా ఆ ఫోజేంటి? యింతమంది మాట్లాడుతున్నా వినబడడం లేదా" అంటూ నాన్నగారందుకున్నారు, అక్కడికి మినిష్టర్ అంటె యెవరేమన్నా వినిపించుకోకుండా ఫోజులు కొట్టేవాడన్న వుద్దేశ్యంతో.

వీళ్ళదాడినుండి యెలా తప్పించుకోవాలా అని శత్రువుల చేతుల్లో చిక్కిన ప్రఖ్యాత డిటెక్టివ్‌లా ఆలోచించసాగాను. ఇంతలో బాస్‌ని రక్షించడానికి వచ్చిన డిటెక్టివ్ అసిస్టెంట్సులా పెద్దన్నయ్య చిన్నకొడుకు, చిన్నన్నయ్య పెద్దకూతురు "బాబాయ్"

అంటూ వచ్చి మీద పడ్డారు. మొత్తానికి దాడి సపరివారంగా చెయ్యబోతున్నారన్నమాట అనుకుని యిద్దరినీ చెరో చేత్తో యెత్తేసుకుని "ఓర్నీ మీరెప్పుడొచ్చారా" అంటూ కబుర్లు మొదలు పెట్టి వాతావరణం మార్చెయ్యాలని చూశాను.

పెద్దన్నయ్య నా వ్యూహం గ్రహించినవాడిలా "రాంబాబూ ! యీసారి యేదో ఒకటి తేల్చి చెప్పకపోతే, మా యిష్టమొచ్చిన సంబంధం సెటిల్ చేసేస్తాం, తరువాత నీయిష్టం" యింక తనమాటకి తిరుగులేదన్నట్లుగా అనేసి నాన్నగారి ప్రక్కనున్న కుర్చీలో కూలబడి వ్యాపార విషయాలు చర్చించడం మొదలుపెట్టాడు. ఒక్కక్షణం నాకేం చెయ్యాలో అర్ధంకాలేదు.

హటాత్తుగ మనసులో ఉన్న ముద్దుగుమ్మ కళ్ళెదురుగ వచ్చి నిలబడి "అందరూ వున్నారు కదా, చెప్పెయ్యకూడదూ" అంటూ కళ్ళు చికిలించి వయ్యారంగా నవ్వింది. "నువ్వింత ఒయ్యారంగా వుంటే యెప్పుడో చెప్పేవాడినికాదూ ! చేసేవన్నీచేసి నంగనాచిలా యెలా నటిస్తోందో" అని ఓ మొట్టికాయ వేయబోయి, పాపం చిన్నపిల్లకదా దానికేం తెలుసు అనుకుని "సరేలే, నువ్వెదురుగా వుంటె నాబుర్ర అస్సలు పనిచేయదు" అని ముద్దు ముద్దుగ ఆ ముద్దుగుమ్మని మళ్ళీ మనసులోకి పంపేశాను.

చేతుల్లోవున్న పిల్లలిద్దరిని దింపి లోపలికి వెళ్ళి ఒదినలిద్దరితో లోకాభిరామాయణం మొదలు పెట్టాను. చివరికారామాయణం కూడ యీ రాంబాబు కళ్యాణంవైపుకే దారి తీసేసరికి, వూపిరాడనట్లుగా వున్న ఆ వాతావరణం నుండి అర్జెంటుగా బయట పడి ఆలోచిస్తూ రోడ్డుమీద నడవసాగాను.

రెండేళ్ళక్రితం వరకు యీ రోడ్డు మీద యెంతో హుషారుగ ఈలవేస్తూ, చింతా లేకుండ తిరిగేవాడిని. బ్యాంకులో కొలీగ్ శేఖర్‌తో ప్రాణస్నేహం, అతడి చెల్లెలయిన విమలని ముద్దుగుమ్మగా తన మదిలో ముద్రించుకోవడానికి దారి తీసింది. ఆ నాటి నుండి విరహ వేదనతో వేగిపోతూ మనశ్శాంతి కూడ లేకుండ తిరుగుతున్నాను.

రెండేళ్ళక్రితం ఒకరోజు శేఖర్ చెప్పిన గుర్తుల ప్రకారం వాళ్ళ పచ్చరంగు నెలాగైతే కనిపెట్టి నెమ్మదిగా వీధిగేటు తీసి లోపల కడుగు పెట్టాను. అంతే! ఆ నిమిషంలోనే నా హృదయం నాకక్కడ చెప్పకుండ, అక్కడ వీధి అరుగు మీద స్నేహితురాళ్ళతో చింతగింజ లాడుతున్న అపరంజి బొమ్మలోకి వెళ్ళిపోయి హాయిగ కూర్చుంది. నాలో ఆ హృదయం ఖాళీ అయినంత మేర తీయని అలజడి మాత్రం మిగిలిపోయింది.

మనిషి బాపు బొమ్మలా లేకపోయినా ఆ ముద్దుగుమ్మ ముఖం మాత్రం ముద్దొచ్చేంత ముద్దుగా వుంది. జారిపోతున్న వోణీని పదే పదే సవరించుకుంటు చింతగింజ లాడుతున్న ఆ చిన్నారి చేతులు యెంత వేగంగా కదులుతున్నాయో నోరు కూడ అదే వేగంతో వాగేస్తోంది.

"శేఖర్ వున్నాడా(ండి)" అంటి అనడానికి మనస్కరించక చివరి మాట మింగేశాను.

> **తస్మాత్ జాగ్రత!**
>
> నవ నాగరికత
> మన్నటి రోడ్డు లాంటిది
> అది
> పి "శ్రైన్" స్పీడును పెంచుతుంది
> కట్టుబాట్లు ఆ రోడ్డుపై
> "స్పీడు బ్రేకర్లు" లాంటివి
> వాటిని నిర్లక్ష్యం చేశావో
> "యాక్సిడెంట్లు" తప్పవు
> బీ కేర్ ఫుల్ !
>
> — చ క్రి

ఒక్క నిమిషమేమో ఆవిడగారి వాక్ప్రవాహానికి ఆనకట్ట పడింది. వెంటనే వాళ్ళింట్లో మనిషినే అన్నంత మామూలుగా నా వంక చూసి "శేఖరన్నయ్య స్నానం చేస్తున్నాడు, మీ పేరు రాంబాబే అయితే లోపలకెళ్ళి కూర్చోండి" అనేసి మళ్ళీ ఆటలో లీనమైపోయింది.

ఆ మాట తీరు చూస్తుంటే నాకు భలే ముచ్చటేసింది. ఇంతలో లోపలినుండి శేఖర్ రావడంతో ఇలవంతావ అక్కడ నుండి కదిలాను.

ఆ తరువాత్తరువాత యింకు మించు వారానికి నాలుగైదు సార్లయినా వాళ్ళింట్లో పావనం చేస్తూ వుండేవాడిని. ప్రతిసారి యేదో మిషతో విమలని పలకరించే వాడిని. అసలే అంతగా బిడియపడే స్వభావం కాదేమో, అతి స్వల్ప కాలంలోనే విమలకి నా దగ్గర బాగా చనువేర్పడిపోయింది.

"నా కొత్త వోణీ బావుందా రాంబాబు," "ఈ రోజు నా పుట్టినరోజు, హేపీ బర్త్ డే చెప్పవేం" అంటూ గారాంగ నా వెనక తిరిగే విమల యింకా బాల్యావస్థ దాటలేదనిపిస్తోంది. స్వీట్ సిక్స్టీన్‌లా మెరిసిపోయే ఆ ముద్దుగుమ్మ మనోపుష్పం యెప్పటికి వికసిస్తుందా అని ఆ నాటి నుండి యీనాటి వరకు మూగగా ఆరాధిస్తూనే వున్నాను.

నా మనసంతా గాఢంగా అల్లుకుపోయి వున్న నా ప్రణయదేవతకోసం జీవితకాలం వేచివుండమన్నా వుండగలను కాని, రానురాను యింట్లో నామీద జరిగే దాడి తీవ్రస్థాయికి చేరుకోవడమేకాదు, విమలకికూడ సంబంధాలు చూస్తున్నట్లు తెలిసింది. మానాన్న ఆశ తెలుసుగనుక విమల తల్లిదండ్రులు యీ ఇంటి ఛాయలకికూడ రారనేది నిస్సందేహం. నేను యింకా మాట్లాడకుండ వూరుకుంటే కొంపలు కూలిపోయే ప్రమాదం జరుగుతుందనిపించింది.


ఈరోజు తప్పనిసరిగ నామూగ ఆరాధనని బయట పెట్టేయాలన్న దృఢనిశ్చయంతో శేఖర్ వాళ్ళ యింటికేసి నడిచాను.

పట్టుచీర సింగారించి లక్ష్మీదేవిలా వాళ్ళింటి గుమ్మందగ్గరే యెదురైన విమల "సమయానికివచ్చావు. అన్నయ్య లేడుగాని ఆలయానికి వెళ్ళాలి తోడురావా రాంబాబు" అంటూ నన్ను లోపలకి రానివ్వకుండ వీధిలోకి దారితీసింది.

అన్నగారికి ప్రాణస్నేహితుడనే చనువు, చిన్నతనంతో కూడిన చిలిపితనం తప్ప ఆ ముఖంలో నా గురించి వేరేభావమేదీ యేర్పరచుకునే వయస్సింకా రాలేదని ఆమె ముఖం చూసినప్పుడల్లా అనిపిస్తుంటుంది నాకు. అందుకే "నా మనసులోని ముద్దుగుమ్మవు నీవు" అని చెప్పలేక సతమతమవుతున్నాను.

గుళ్ళో ప్రసాదం తీసుకున్న తరువాత మెట్లమీద కూర్చుని సంభాషణ కుప క్రమిస్తూ "విమలా" అని పిలిచాను, ఆమెవైపు చూస్తూ.

కొబ్బరిముక్క తినడమే నాజీవితధ్యేయం అన్నట్లు చంటిపిల్లలా కొబ్బరిముక్కని కొరుక్కుతింటున్న విమల, తినడం ఆ






కుండానే పిలిచావా? అన్నట్టు ముఖం నావైపుకి తిప్పి కళ్ళు చికిలించి నొసలు చిట్లిస్తూ చూపింది. సరిగ్గా ఆ ఫోజులో (అంటే కొబ్బరిముక్క తింటూ అనికాదు) అలా కళ్ళు, నొసలు చిటిస్తూ చూస్తుంటే విమలముఖం ఎంత ముద్దుగా వుంటుందో చెప్పలేను. ఆ ఫోజు పెట్టడం విమలకెంత అలవాటో అది చూసినప్పుడల్లా ఆమె ముఖం ముద్దెట్టుకోవాలని అనుకోవడం నాకూ అంతే అలవాటు. కాని నా భావం యెప్పుడూ పైకి ప్రకటించలేదు. అలా ప్రకటిస్తే కనీసం రోజుకోసారైనా ఆ ముద్దు ముఖం చూసే భాగ్యం నాకు లేకుండ పోతుందేమో! అని నాభయం. మరీ నిగ్రహం నశించినప్పుడు ఓ రెండురోజులపాటు వాళ్ళ యింటి ఛాయలకి పోకుండ వుంటాను.

"పిలిచావెందుకు రాంబాబూ" అన్న విమల మాటలకి ఈ లోకంలో పడ్డాను.

ఆ చిలిపిముఖంచూస్తూ మాట్లాడ లేనట్టు నటించి, ఎదురుగావచ్చే భక్తులనుచూస్తూ "భగవంతుడిని యేం కోరుకున్నావు విమలా" అని అడిగాను నెమ్మదిగ.

వెంటనే తడుముకోకుండ "మంచి అబ్బాయితో త్వరగ పెళ్ళి జరిగేలా చేసి ఈ వేధన చదువునుండి నాకు విముక్తి కలిగించు దేవా అని" అంటూ కిలాకిలా నవ్వింది.

ఆ సమాధానం విని ఒక్కక్షణం బిత్తర పోయాను. పాపం! రెండేళ్ళనుండి చదువు తున్నా గట్టెక్కలేని టెన్త్ క్లాస్ చదువంటే బోరుకొట్టి, పెళ్ళయితే ఆగోల తప్పుతుందను కునే యీ అపరంజి బొమ్మకి పెళ్ళంటే యేమిటో ఆలోచించే మనసెప్పటికి వస్తుంది అనుకుని నాలో నేనే దిగులు పడిపోయాను. ఈ రెండేళ్ళనుండీ విమల చేతలూ, మాటలూ గమనిస్తూ ప్రతిసారీ యిలాగే అనుకుంటూ వచ్చాను. కాని యీ రోజు తప్పనిసరిగ యింకో అడుగు ముందుకు వేశాను.

"నేను మంచి అబ్బాయినేనా విమలా" అని అడిగాను ఏం సమాధానం చెబుతుందా అని కుతూహలంగా చూస్తూ.

"ఎందుకు కాదు, నువ్వు చాల మంచి వాడివి", ఆ'చాల' అనే భావం వ్యక్త

మయ్యేలా కళ్ళు తిరిగేలా మూప తెరుస్తూ అంది

"అయితే నిన్ను పెళ్ళి చేసుకోనా మరి" అన్నాను ఆ ముఖంలోకి చూస్తూ. నామాట వినగానే సంతోషంగా నా వంక తిరిగి "నిజంగా నన్ను పెళ్ళి చేసుకుంటావా? అయితే, త్వరగా మా నాన్నగారికి చెప్పవా! నువ్వు చెప్తే కాదనరు. యీ వెధవ చదువు నేను చదవలేకపోతున్నాను" అంటూ చిన్న పిల్లలా నా చేతులు పట్టుకుని వూపేసింది.

ఆపిల్ల సంబరం చూస్తుంటే నాకు నవ్వాలో యేడవాలో అర్థం కాలేదు. మానసికంగా పెళ్ళీడురాని యీ అమ్మాయికి అప్పుడే సంబంధాలు చూస్తున్నందుకు వాళ్ళ పెద వాళ్ళనీ, పెళ్ళి, పెళ్ళంటూ నామీద వత్తిడి తెస్తున్నందుకు మా పెద్దవాళ్ళనీ తిట్టుకుంటూ కూర్చున్నాను.

కాని, విమల దగ్గర యీ ప్రసక్తి తేవడం ఎంత పొరపాటో, మర్నాడు పొద్దున్న "ముహూర్తం ఎప్పుడు పెట్టించమన్నావ్" అని శేఖర్ నవ్వుతూ అడిగినప్పుడుగాని తెలియలేదు ఇంకబయటపడ్డాక చేసేదేముంది. అయినా, ముందో వెనకో యిది జరగాల్సిందేగా! ఆమె మానసికంగా ఎదగడానికి చేయవలసిన ప్రయత్నాలేవో పెళ్ళయ్యాక చేద్దాంలే, అంతగా అయితే యే మానసిక వైద్యుడినో సంప్రతించవచ్చు. అంతేగాని ఆ ముద్దు గుమ్మని వదులుకుని బ్రతకలేననిపించింది.

అందుకే, "సాయంత్రం అన్నయ్యని తీసుకువస్తాను" అని శేఖర్‌కి సమాధాన మిచ్చాను సాయంత్రం పెద్దన్నయ్య దగ్గర సంగతి, సందర్భాలు (ముద్దుగుమ్మ మన స్తత్వం తప్ప) వివరించాను మనస్ఫూర్తిగా నా సుఖాన్ని ఆశించేవాడివైతే ఈ పెళ్ళి జరిగేలా చూడమన్నాను.

నేను పెళ్ళికి ఒప్పుకున్నాననే సంతోషంతో నాన్నగారిని ఒప్పించే బాధ్యత అన్నయ్య స్వీకరించాడు. నాన్నకీ, డబ్బుకి లంకె గనుక, వాళ్ళ కట్నంగా నా పేర రాసిచ్చే లక్ష రూపాయల ఖరీదు చేసే పచ్చడాబాతో నాన్న గారి నోరు తేలిగ్గానే మూయించేశాము.

ఒకే కూతురు కావడంతో వాళ్ళు పెళ్లి కూడ ఘనంగానే చేశారు. కాని విమల మనసు పరిపక్వత చెందకుండానే తనని పెళ్లి చేసుకుంటున్నాననీ, నవయవ్వన వనిత, కలల పెళ్ళి కూతురిగ కలిగే ఆనందానుభూతులకు తనని దూరం చేస్తున్నాననే బాధ మాత్రం నన్ను వెన్నాడుతూనే వుంది.

'సుపుత్ర ప్రాప్తిరస్తు' అంటూ దీవించే పెద్దల దీవెనలు విని యీవిడగారింకా దార్లోకి రాకుండానే పుత్రులెక్కడ నుండి వస్తారండీ బాబూ! అని నాలో నేనే నవ్వు కుంటూ క్రీగంట విమలని చూశాను. తల బాగా వంచి వుండడంతో తన ముఖంలో భావాలు నాకు కనిపించలేదు. అయినా నా చాదస్తం కాకపోతే, యీ బుజ్జి పాపాయికి భావాలేముంటాయి? బహుశ తల వంచుకుని వుండకపోతే వాతలు పెడతానని బెదిరించి వుంటారు వాళ్ళమ్మగారు. లేకపోతేనా, యీ అల్లరిపిల్ల పీటల మీదే "రాంబాబగా, నా చీర బావుందా!" అంటూ యేదో ఒకటి మాట్లాడకుండ వుంటుందా? అని నాలోనేను ఓ వెర్రి నవ్వు నవ్వుకున్నాను.

తెల్లవారుఝామున పెళ్లి పీటల మీద నుండి లేచిన దగ్గరనుండి ఈ రోజు రాత్రి విమలతో ఏంమాట్లాడాలి? ఎలామాట్లాడాలి? అని ఆలోచిస్తూనే వున్నాను. చివరికి అనుకున్న ఘడియ రానే వచ్చింది.

భార్యతో తొలిరేయి గడపబోయే భర్తకుండే వుద్వేగం గాని ఆతృతగాని నాలో మచ్చుకైనా లేవు. విద్యార్థులకి పాఠం చెప్ప డానికి వుద్దిక్తుడయ్యే ఉపాధ్యాయుడు లాగ వున్నాననిపించింది.

సర్వాలంకృతురాలై ముగ్ధలా నిలబడిన విమలని చూసేసరికి ఒక్క క్షణం ఒళ్ళు మరచిపోయి అలాగే చూస్తుండి పోయాను.

ఇంతటి ముద్దుగుమ్మని పొందడానికి ఎన్ని కష్టాలు పడవలసి వచ్చింది? అనుకునేసరికి హఠాత్తుగా నాన్నగారు గుర్తొచ్చారు.

బహుశ యీపాటికి ఈ పెళ్ళికి కట్నమనేది లేదనీ, నేనూ, పెద్దన్నయ్యా కలసి ఆయన కలా అబద్ధం చెప్పామని తెలిసి ఎలా భరత నాట్యమాడుతున్నారో తలుచుకునేసరికి నవ్వొచ్చింది.

"ఎందుకండీ నవ్వుతున్నారు" అన్న విమల మాటలకి ఉలిక్కిపడ్డాను. "ఏమిటి, బండీ అప్పుడే అండిలో కొచ్చింది అలా పిలవమని మీ అమ్మగారు చెప్పారేంటి" అన్నాను ప్రక్కనే కూర్చోమని చోటు చూపిస్తూ.

సమాధానంగా ఒక చిరునవ్వు నవ్వి తల వంచేసుకుంది. నేను కొద్దిగా ఆశ్చర్యపోయి, చిన్నపిల్ల కదా యీ తతంగమంతా చూసి గాభరా పడుతుందేమో! అనుకుని భయం లేదన్నట్లు భుజంమీద చెయ్యివేసి ప్రక్కన కూర్చోపెట్టుకున్నాను.

ఆ తరువాత, ఎంతో లాలనగా "నేనంటే నీ కిష్టమేనా విమలా" అని అడిగాను.

నా మాటలకి నెమ్మదిగా తలెత్తిన విమల, మనోహరంగా ఒక నవ్వు నవ్వి "రెండేళ్ళనుండి సెన్స్ క్లాస్ ఎందుకు పాసవడం లేదనుకుంటున్నారు? చూపు పుస్తకం మీద, చిత్తం రాంబాబు మీద" అంటూ సిగ్గుతో నా ఒళ్ళో వాలిపోయింది.

"ఔరా! ఎంతటి లోతుగుండె మీ ఆడ వాళ్ళది" అంటూ ఆశ్చర్యానందాలతో నోరు తెరిచేశాను.

